సాక్షి ఖమ్మం

శనివారం : 20 : సెప్టెంబర్ : 2025



దసరాకు ఆర్టీసీ రైట్ రైట్ !

దసరా సెలవులు మొదలవుతున్న సందర్భంగా రద్దీకి అనగుణంగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. IIలో



'ఆరోగ్యశ్రీ' ఆస్పత్రుల్లో తనిఖీలు

'ఆరోగ్యశ్రీ' ఆస్పత్రుల్లో నిబంధనల అమలును తనిఖీ చేసేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. IIలో

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి 26న ఇంటర్వ్యూలు



ఖమ్మం సహకారనగర్: ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి ఈనెల 26వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్, డీఈఓ శ్రీజ తెలిపారు. ఖమ్మం, కల్లూరు ఆర్డీఓ కార్యాలయాల్లో జరిగే ఇంటర్వ్యూకు అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతలు, స్థానికత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగానికి 18–44 ఏళ్ల వయస్సు కలిగి స్థానికులై ఉండాలని, నిబంధనల ప్రకారం వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లుగా ఇంటర్ ఆపై విద్యార్హత, ఆయాలుగా 7వ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని వెల్లడించారు.

లద్దాక్ మారథాన్‌లో జిల్లా వాసి సత్తా



రన్ పూర్తిచేశాక జీవీ.ప్రసాద్

ఖమ్మం స్పోర్ట్స్: నడి వయస్సులోనూ మారథన్‌లో రాణించాలనే సంకల్పంతో నిత్యం ప్రాక్టీస్ చేసిన ప్రభుత్వ ఉద్యోగి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాడు. ఖమ్మం బీకే.బజార్‌కు చెందిన జీవీ.ప్రసాద్ హైదరాబాద్ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల 14వ తేదీన లద్దాక్‌లో జరిగిన జాతీయస్థాయి మారథాన్ రేస్‌లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా 42.20 కి.మీ. రేస్‌ను అవలీలగా పూర్తి చేసిన ఆయన త్వరలో జరగనున్న 72 కి.మీ. మారథాన్‌కు ఎంకయ్యాడు. లద్దాక్‌లోని ఎత్తయిన ప్రదేశాల్లో మారథాన్ పూర్తిచేయడం కష్టమైనప్పటికీ వారం ముందుగా వెళ్లి అక్కడి వాతావరణానికి అలవాటు పడడంతో సులువైందని ప్రసాద్ తెలిపారు. కాగా, ఆయన ఇప్పటికే కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో జరిగిన మారథాన్ రన్లలో సత్తా చాటి 50కి పైగా పతకాలు సాధించడం విశేషం.

బోధనపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న మైనార్టీ సంక్షేమాధికారి ముజాహిద్

సత్తుపల్లిటౌన్: మైనార్టీ గురుకులాల్లో ప్రభుత్వ ఆదేశాల మెనూ పక్కాగా అమలుచేస్తేనే విద్యా బోధనపై దృష్టి సారించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండీ.ముజాహిద్ సూచించారు. సత్తుపల్లి గుడిపాడులోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు, తరగతి గదులు, డార్మెటరీలు, వంటశాల పరిశీలించాక ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇప్పటివరకు జరిగిన బోధన, పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న తీరుపై తీశాక పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు, పూలతోటలతో లాభాలు



పూలతోటను పరిశీలిస్తున్న అధికారులు

ముదిగొండ: సంప్రదాయ పంటలతో నష్టపోతున్న ఉద్యాన పంటలు, పూలతోటల సాగుతో లాభాల బాట పట్టొచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. ముదిగొండ మండలంలోని గోకినేపల్లి, మేడేపల్లి, మాధాపురం గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేస్తున్న బంతి, లిల్లీ, గులాబీ తోటలతో పాటు అరటి, ఆయిల్‌పామ్ తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్లాస్టిక్ మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేస్తున్న రైతులను అభినందించడంతో పాటు తెగుళ్ల నివారణ, డ్రిప్ విధానంలో జాగ్రత్తలపై సూచనలు చేశారు. మధిర డివిజన్ ఉద్యాన అధికారి విష్ణు, రైతులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..

- విధుల్లో నిర్లక్ష్యం, అక్రమార్కులపై చర్యలకు తాత్సారం
- కొన్ని మండలాల్లో ఉద్యోగుల వసూళ్లు
- డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహంతో పలువురి బదిలీ



చిన్నమండవ మున్నేటి వద్ద అక్రమంగా ఏర్పాటుచేసిన గేటు, సీసీ కెమెరా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించడమే కాక ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై పట్టింపు లేకపోవడం, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారికి అండగా పలు మండలాల అధికారులు నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వారి వ్యవహార శైలిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యాన చింతకాని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎస్సై నాగుల్‌మీరా, పెనుబల్లి తహసీల్దార్ నారాయణమూర్తిపై బదిలీ వేటు పడింది. ఇందిరమ్మ ఇళ్ల కూపన్ల ఆధారంగా ఇసుక తరలిస్తున్న వారి నుంచి కొందరు అక్రమంగా వసూలు చేస్తున్నా పట్టించుకోకపోవడం చింతకాని అధికారులపై వేటుకు కారణమైంది. ఇక అవినీతి ఆరోపణలు, వ్యవహారశైలి బాగాలేకపోవడంతో పెనుబల్లి తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నారు.

డిప్యూటీ సీఎం ఆగ్రహం

అక్రమ వసూళ్ల విషయం తెలియడంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఖమ్మంలో ఈనెల 17న కలెక్టర్, సీపీలతో పాటు చింతకాని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సైతో సమావేశమయ్యారు. అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు భట్టి ఆదేశాలతో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎస్సై నాగుల్‌మీరాను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతేకాక మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఈ అంశంపై విచారణ చేపట్టారు.

పాస్ పుస్తకాలు ఎలా?

ముదిగొండ మండలంలోని గంగాపురం రెవెన్యూ గ్రామాన్ని దశాబ్దాల క్రితమే మున్నేటి వరద ముంచెత్తుతుండడంతో ప్రజలు ఖాళీ చేశారు. ప్రస్తుతం అక్కడ 122 సర్వేనంబర్ నుంచి 126 సర్వేనంబర్ వరకు 14మంది పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకున్నారు. గంగాపురం రెవెన్యూ పేరుతో పొందిన పాసుపుస్తకాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్నేరు నడిమధ్యలో నిబంధనలను ఉల్లంఘించి అధికారులు వారికి పాసుపుస్తకాలను జారీ చేశారని చెబుతున్నారు.



మున్నేటి ఇసుక రీచ్ వద్ద ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

నిర్లక్ష్యం.. వేధింపులు

పెనుబల్లి తహసీల్దార్ నారాయణమూర్తి వ్యవహార శైలిపైనా ఆరోపణలు వచ్చాయి. ఆయనపై గతంలోనూ రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. అప్పుడే నారాయణమూర్తి అనారోగ్యానికి గురి కాగా ఇద్దరు ఆర్ఐలపై చర్యలు తీసుకున్నారు. సదరు తహసీల్దార్ అవినీతికి పాల్పడడమే కాక సిబ్బందిని, పనుల నిమిత్తం వచ్చేవారిని దుర్భాషలాడతారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కొందరు రైతులు మరోమారు ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె మంత్రి పొంగులేటికి వివరించారు. దీంతో తహసీల్దార్‌ను కలెక్టరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



మున్నేరులో నిర్మించిన రహదారి

వసూళ్లపై పట్టింపులేనితనం

చింతకాని మండలం చిన్నమండవ ఇసుక రీచ్ నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులు కూపన్ల ఆధారంగా ఇసుక తరలింపునకు అనుమతించారు. అయితే ముదిగొండ మండలం మున్నేటి సమీపాన పట్టా భూములు ఉన్నాయంటూ కొందరు డబ్బు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం మున్నేటిలో రహదారి ఏర్పాటుచేయడమే కాక లోపలకు వెళ్లకుండా గేటు బిగించారు. ఒక్కో ట్రాక్టర్ నుంచి ఇక్కడ రూ.వేయి వరకు వసూలు చేస్తున్నా మండల రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై లబ్ధిదారులు, ట్రాక్టర్ల యజమానులు, పార్టీల నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

'సీతారామ' భూసేకరణ పూర్తి చేయండి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మంఅర్బన్: జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా పెండింగ్ భూసేకరణ పూరిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి నీటిపారుదల, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించాక కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ, అటవీ ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి నాటికి యాతాలకుంట ద్వారా నీరు విడుదల చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా పరిధిలో 507 ఎకరాల అటవీ భూమికి బదులు ప్రత్యామ్నాయ భూములు కేటాయించాలని తెలిపారు. అలాగే, ప్యాకేజీ–13, 14, 16లో పెండింగ్ పనులపై సమీక్షించారు. ఖమ్మం, కొత్తగూడెం ఎస్ఈలు మంగళపుడి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ ఖమ్మం సహకారనగర్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను జిల్లాలో వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 571 గ్రామాలకు గాను ఇప్పటికే 69 శాతం పూర్తయినందున మిగతాది పూర్తిచేస్తే కేంద్రప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయని తెలిపారు. ఫలితంగా మరిన్ని ఇళ్ల నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

■ ప్రణాళికాయుతంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఎస్ఎస్ఆర్‌పై శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొన్నారు. 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను మరోసారి ధ్రువీకరించడం తదితర అంశాలపై ఎన్నికల అధికారి సూచనలు చేయగా, జిల్లాలో పనులను కలెక్టర్ వివరించారు. ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, డీఎల్‌పీఓ రాంబాబు, డీటీ అన్సారీ పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అధికారులు

'సర్దుబాటు'లో పైరవీలు!

- ఉపాధ్యాయుల కేటాయింపుపై ఆరోపణలు
- ఎంఈఓల తీరుపై సంఘాల మండిపాటు
- నిబంధనలకు విరుద్ధంగా నివేదికలు ఇచ్చారని విమర్శలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా సబ్జెక్టు ఉపాధ్యాయుల నియామకానికి అదనంగా ఉన్నచోట నుంచి సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని భావించారు. విద్యాసంవత్సరం మొదట్లోనే ఈ ప్రక్రియ జరగాల్సి ఉన్నా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా అదనపు కలెక్టర్ శ్రీజ డీఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించాక సర్దుబాటుకు సంబంధించి క్షేత్రస్థాయి వివరాలతో నివేదికలు ఇవ్వాలని ఎంఈఓలను ఆదేశించారు. ఆపై నివేదికల ఆధారంగా రెండు రోజుల క్రితం 311మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని మండలాల ఎంఈఓలు తప్పుడు నివేదికలు ఇచ్చి అదనపు కలెక్టర్‌ను తప్పుదారి పట్టించారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

311మందికి స్థానచలనం

జిల్లాలో 311 మంది ఉపాధ్యాయులను వారు పనిచేస్తున్న పాఠశాలల నుంచి ఇతర చోట్లకు సర్దుబాటు చేశారు. అయితే, ఈ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం చేపట్టలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఏదైనా పాఠశాలలో టీచర్ల కొరత ఉంటే, సమీప పాఠశాలల్లో లేదా సమీప మండలాల నుంచి కేటాయించేలా నిబంధనలు ఉన్నాయని వారు చెబుతున్నారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా సర్దుబాటు చేశారని విమర్శిస్తున్నారు.

ఎంఈఓలపై తీవ్ర ఆరోపణలు

జిల్లా విద్యాశాఖాధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ ఉపాధ్యాయుల ఖాళీలు, సబ్జెక్టు టీచర్లు ఎక్కడెక్కడ అదనంగా ఉన్నారో నివేదిక సమర్పించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఈ క్రమంలోనే పలువురు ఎంఈఓలు చేతివాటం ప్రదర్శించినట్లు విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు తప్పనిసరని.. అవి పట్టణ ప్రాంతాలైతే తమను ఆశ్రయించిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేలా నివేదికలు సమర్పించారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక దివ్యాంగులు, ఇంకొన్ని ప్రత్యేక కేటగిరీల టీచర్లు సుదూర ప్రాంతాలకు బదిలీ కావడానికి ఎంఈఓల తీరే కారణమని చెబుతున్నారు. నిబంధనల ప్రకారమైతే తొలుత ఏ కాంప్లెక్స్ ఉపాధ్యాయులను అదే కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అలా కుదరకపోతే అదే మండలంలోని ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేయాలి. అయినా సాధ్యం కాకపోతే సమీప మండలాలకు ఉపాధ్యాయులను కేటాయించాలి. అలా కాకుండా సుదూర ప్రాంతాలకు సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను బదిలీ చేయడం చర్చకు దారి తీసింది. ఇదిలా ఉండగా కొన్నాళ్ల క్రితం టీచర్ల బదిలీ సమయంలోనూ రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చేందుకు ఎంఈఓలు ఇబ్బంది పెట్టారని తెలుస్తోంది.

మొత్తం రద్దు చేయాల్సిందే..

ఉపాధ్యాయుల సర్దుబాటుపై టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంగళరావు మాట్లాడుతూ ఖాళీలు, అదనంగా టీచర్లు ఉన్న వివరాలపై నివేదిక ఇచ్చే సమయాన ఎంఈఓలు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. అంతేకాక తొలుత ఒకరిని సర్దుబాటు చేశాక మళ్లీ స్థానాలు మార్చారన్నారు. ఎంఈఓల తీరుపై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌తో పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మారుమూల ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు, అదీ 60 – 70 కి.మీ. దూరానికి సర్దుబాటు చేయడం సరి కాదని తెలిపారు. రాజకీయ అండదండలు, పలుకుబడి కలిగిన వారికి మంచి స్థానాలు దక్కేలా అధికారులు వ్యవహరించినందున, ప్రక్రియను రద్దుచేసి మరోమారు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

■ జరిగిన తప్పుల్లో కొన్ని...

టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో తప్పులు జరిగాయని చెబుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొన్ని ఉదాహరణలను ప్రస్తావిస్తున్నారు. ఎంపీపీఎస్ తిరుమలాయపాలెం నుంచి ఖమ్మం అర్బన్ మండలం ఎన్నెస్పీ కాలనీ పాఠశాలకు, ఎంపీపీఎస్ రఘునాథపాలెం నుంచి ఖమ్మం అర్బన్ మండలం రాపర్తినగర్ జీపీఎస్‌కు, కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి నుంచి ఖమ్మం అర్బన్ మండలం ఖాజీపుర జీహెచ్ఎస్‌కు, ఎన్నెస్పీ కాలనీ జీహెచ్ఎస్ నుంచి కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి జెడ్పీఎస్ఎస్‌కు... ఇలా మండలం, దూరం పొంతన లేకుండా ఉపాధ్యాయులను కేటాయించారని చెబుతున్నారు. అంతేకాక జీహెచ్ఎస్ రిక్కాబజార్ నుంచి పుట్టకోట జెడ్పీఎస్ఎస్‌కు, తల్లాడ నుంచి ఖమ్మం రోటరీనగర్‌కు, రిక్కాబజార్ స్కూల్ నుంచి వేంసూరు మండలం అడసర్లపాడుకు, బోనకల్ మండలం ఆళ్లపాడు నుంచి నేలకొండపల్లి మండలానికి, పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి బోనకల్ ఇతర మండలాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడాన్ని సైతం తప్పుపడుతున్నారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మకండి

కామేపల్లి: అవసరానికి సరిపడా యూరియా దొరకదంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. ఈ ప్రచారంతో కొందరు రైతులు యూరియా నిల్వ చేస్తున్నారనే సమాచారం ఉందని తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా పంపిణీ చేయనున్నందున ఎవరూ ఆందోళనకు గురికావొద్దని చెప్పారు. కామేపల్లి మండలం ముచ్చర్ల రైతు వేదికలో శుక్రవారం యూరియా పంపిణీని పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. పంటల సాగుకు అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందని, అయినా కొరతపై తప్పుడు ప్రచారంతో కొందరు నిల్వ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాకాకుండా అవసరం మేరకే తీసుకోవాలని డీఏఓ సూచించారు. ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ దీపక్‌రెడ్డి, ఇల్లెందు మార్కెట్ డైరెక్టర్ గుగులోత్ గబ్రూనాయక్, పీఏసీఎస్ సీఈఓ గాదె నాగయ్య, సిబ్బంది సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

యూరియా.. ఏదయా?

- కూపన్ల విధానంతోనూ పరిష్కారం కాని సమస్య
- ఒకే బస్తా చొప్పున ఇస్తుండడంతో రైతుల అవస్థ
- ఈనెల సరిపడా స్టాక్ రాక పంపిణీలో ఇక్కట్లు



కూపన్ల కోసం కారేపల్లి సొసైటీ వద్ద కిక్కిరిసిన మహిళా రైతులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఒక బస్తా యూరియా కోసం రైతులు చిన్నపాటి యుద్ధమే చేయాల్సి వస్తోంది. సొసైటీకి యూరియా వచ్చిందని తెలియగానే గంటల తరబడి బారులు తీరడం, ఆపై కూపన్.. ఆతర్వాత బస్తా దక్కించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. రెండు రోజులుగా చింతకాని మండలం పందిళ్లపల్లిలోని రేక్‌పాయింట్‌కు యూరియా చేరుతుండగా, సొసైటీల వారీగా కూపన్ల పంపిణీ ప్రారంభించారు. ఇందుకోసం జిల్లాలోని కారేపల్లి సొసైటీ, కొణిజర్లలో కార్యాలయాలకు రైతులు వేలాదిగా తరలివచ్చారు. వందల సంఖ్యలో బస్తాల యూరియా కోసం వేలాది మంది పోటీ పడడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినా ఫలితం కానరాలేదు.

అంచనా – సరఫరాలో వ్యత్యాసం

ఈ వానాకాలం జిల్లాలో అన్ని పంటలు 6,50,015 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో వరి 2,95,012 ఎకరాల్లో, పత్తి 2,25,613 ఎకరాల్లో ఉండగా, మొక్కజొన్న, వేరుశనగలు, పెసలు తదితర పంటలు ఉన్నాయి. ప్రధానంగా వరి, పత్తి పంటలు ఏపుగా పెరిగేందుకు యూరియా ఉపయోగపడుతుంది. తొలుత కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 54,825 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసింది. ఆ తర్వాత 27,865 మెట్రిక్ టన్నులే పంపాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు 25,884 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు చేరడంతో సరఫరాలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

దెబ్బతిన్న పంటలు

వరి, పత్తి కీలక సమయంలో జిల్లాకు అరకొరగానే యూరియా సరఫరా అయింది. దీంతో రైతులు పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా కొందరికి యూరియా లభించక మిగతా వారి పొలాలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో వరి ఎదుగుదల లేక, దుబ్బు లేక పాడైంది. పత్తి పంట పరిస్థితి కూడా అలాగే కనిపిస్తోంది.

కేంద్రాల వద్ద ఉద్రిక్తత

అవసరమైనంత మేర యూరియా జిల్లాకు రాకపోవడంతో అధికారులు రైతులకు తొలుత కూపన్లు జారీ చేస్తున్నారు. ఆపై యూరియా రాగానే పంపిణీ చేస్తుండగా ఉద్రిక్తత నెలకొంటోంది. అందరికీ కూపన్లు ఇచ్చినా వారికి సరిపడా యూరియా రాకపోవడంతో దక్కని వారు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కారేపల్లి, కొణిజర్ల కేంద్రాల వద్ద కూపన్ల కోసం తొక్కిసలాట జరగగా కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. కారేపల్లిలో వేలాది మంది రావడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమాన ఏఓ అశోక్‌కుమార్ సొమ్మసిల్లారు. ఆపై పీఏసీఎస్ నుంచి జిన్నింగ్ మిల్లుకు మార్చడంతో రైతులు పరుగులు తీయగా అక్కడా తోపులాట జరిగింది.

యాసంగికి కూడా ఇప్పుడే..

ఈ వానాకాలం సీజన్‌కే యూరియా అందక రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అయితే తక్కువ భూమికి కలిగిన కొందరు రైతులు యాసంగి కోసం కూడా ఇప్పుడే యూరియా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా కూడా కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతున్నట్లు సమాచారం.

తెల్లవారుజామున వచ్చాం..



ఎన్నిసార్లు తిరిగినా యూరియా దొరకలేదు. ఈరోజు కూపన్ కోసం తెల్లవారుజామున వచ్చాం. రెండెకరాల్లో పత్తి, ఎకరంలో వరి పంట వేశాం. ఒక్క బస్తా యూరియా అయినా వేయకపోతే పంటలు దెబ్బతింటాయి. తొక్కిసలాట జరగకుండా అందరికీ యూరియా సరఫరా చేయాలి.

–అజ్మీరా చిన్ని, భజ్యా తండా, కారేపల్లి

సరఫరాలో ఇబ్బందులు లేవు..



జిల్లాకు గురువారం, శుక్రవారం యూరియా వచ్చింది. పీఏసీఎస్‌ల్లో రైతులకు కూపన్లను జారీ చేసి యూరియా అందిస్తున్నాం. ప్రస్తుతం సరిపడా ఉండగా, ఈ నెలాఖరుతో డిమాండ్ తగ్గుతుంది. కొందరు రైతులు యాసంగి సాగు కోసం కూడా తీసుకుంటున్నారు.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాకు రావాల్సిన, సరఫరా అయిన యూరియా (మెట్రిక్ టన్నుల్లో)

నెల	రావాల్సింది	సరఫరా
ఏప్రిల్	419	419
మే	2,527	2,527
జూన్	4,708	4,708
జూలై	7,500	6,434
ఆగస్టు	4,610	6,025
సెప్టెంబర్	8,101	5,771 (ఇప్పటి వరకు)
మొత్తం	27,865	25,884

అధికారుల నిలదీత



అధికారులను నిలదీస్తున్న రైతులు

కొణిజర్ల: కొణిజర్ల సొసైటీ కార్యాలయానికి శుక్రవారం 960 బస్తాల యూరియా వచ్చింది. దీంతో రైతులు ఆడామగా తేడా లేకుండా బారులు దీరారు. అయితే 960 మందికే కూపన్లు ఇవ్వడం, మరో 200మందికి పైగా మిగలడంతో వ్యవసాయ, సొసైటీ అధికారులను నిలదీశారు. అందరికీ కూపన్లు ఇవ్వాల్సిందేనని పంచాయతీ కార్యాలయం ఎదుటే బైటాయించారు. శనివారం మరో లోడ్ వస్తుందని చెప్పిన ఏఓ డి.బాలాజీ, ఎస్ఐ సూరజ్ అందరికీ కూపన్లు ఇస్తామనడంతో ఆందోళన విరమించారు.

జిల్లా అధికారుల ఆరా

కారేపల్లి: కారేపల్లి పీఏసీఎస్‌కు వేలాదిగా రైతులు రావడంతో యూరియా కూపన్ల జారీలో ఉద్రిక్తత చోటు చేసుకోగా శుక్రవారం సాయంత్రం జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య, వైరా ఏడీఏ కరుణశ్రీ చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఇప్పటి వరకు 2,152 కూపన్లు పంపిణీ చేశామని, మరో 1,600 కూపన్లు ఇవ్వాల్సి ఉందని ఉద్యోగులు చెప్పారు. రద్దీ నివారణకు మండలంలోని ఐదు రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని అధికారులు సూచించారు. సొసైటీ చైర్మన్ దుక్కినేని శ్రీనివాసరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, దేగల ఉపేందర్, సీఈఓ బొల్లు హన్మంతరావు పాల్గొన్నారు.

దసరాకు ఆర్టీసీ రైట్ రైట్!

నేటి నుంచి ప్రత్యేక బస్సులు...
- రీజియన్ నుంచి 17 రోజుల్లో 1,025 సర్వీసులు నడిపేలా ప్రణాళిక
- గ్రామీణ ప్రాంతాల బస్సులపై సందిగ్ధత



ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లే వారితో పాటు సెలవుల వేళ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు కసరత్తు పూర్తిచేశారు. బతుకమ్మ, దసరా పండుగకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సొంత గ్రామాలకు వస్తారు. ఈ రద్దీకి అనుగుణంగా ఏయే ప్రాంతాలకు ఎన్ని బస్సులు నడపాలో ప్రణాళిక రూపొందించారు. అయితే, ఈసారి ప్రత్యేకం పేరిట నడిపే అదనపు సర్వీసుల్లో 50శాతం అదనపు చార్జీ వసూలు చేయనున్నారు. అదనపు సర్వీసులన్నీ హైదరాబాద్ రూట్‌లోనే ఏర్పాటు చేస్తుండడంతో డిపోల నుంచి మారుమూల గ్రామాలకు నడిచే బస్సుల సంఖ్య తగ్గనున్నట్లు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్, ఇతర పట్టణాల నుంచి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల వచ్చేవారు స్వగ్రామాలకు వెళ్లడంలో ఇక్కట్లు ఎదుర్కొనే అవకాశముంది.

పూల పండుగ ప్రత్యేకం

తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగకు ప్రత్యేకత ఉంది. పండుగల సందర్భంగా విద్యాసంస్థలకు ఈనెల 21 నుండి సెలవులు ప్రకటించగా 20వ తేదీ నుండే ప్రయాణికులు స్వగ్రామాలకు బయలుదేరనున్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సుల్లో నిత్యం రద్దీ ఉంటుండడం.. ఇప్పుడు సెలవులతో మరింత పెరగనుండడంతో అధికారులు అదనపు సర్వీసులు నడిపేందుకు సిద్ధమయ్యారు. రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తే, రోజువారీ మార్గాల్లో బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది. దీంతో శ్రీశైలం, హన్మకొండ తదితర ప్రాంతాల సర్వీసులను రద్దు చేసి అదనపు సర్వీసుల కింద వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుండి రీజియన్‌కు రద్దీ ఉంటుందనే అంచనాతో అధికారులు ఈ మార్గంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

1,025 ప్రత్యేక సర్వీసులు

దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో 1,025 ప్రత్యేక సర్వీసులు నడిపిస్తారు. ఈనెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, అక్టోబర్ 2నుండి అక్టోబర్ 6 వరకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఉంటాయి. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సుల సంఖ్య పెంచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే, 24గంటల పాటు నాన్‌స్టాప్ సర్వీసులు తిప్పుతారు. ఇవికాక ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు ప్రాంతాలకు కూడా బస్సులు అందుబాటులో ఉంచుతారు.

ఖమ్మం రీజియన్‌లోని డిపోల వారీగా నడిపే అదనపు సర్వీసులు

డిపో	నాన్ రిజర్వేషన్	రిజర్వేషన్	మొత్తం
ఖమ్మం	161	75	236
మధిర	136	62	198
సత్తుపల్లి	84	75	159
భద్రాచలం	98	65	163
కొత్తగూడెం	69	45	114
మణుగూరు	59	36	95
ఇల్లందు	43	17	60
రీజియన్	650	375	1,025

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి



దసరా సెలవుల్లో ప్రయాణికులు సౌకర్యవంతంగా, సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఆర్టీసీ తరఫున అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తే గమ్యస్థానాలకు సాఫీగా చేరుకోవచ్చు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతాం. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నందున ప్రయాణికులు వినియోగించుకోవాలి.

– ఏ.సరిరాం, ఖమ్మం రీజియన్ మేనేజర్

హెచ్‌టీ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు!

- ప్రయోగాత్మకంగా పరిశ్రమల్లో ఏర్పాటు
- 4జీ సిమ్‌తో సర్వర్‌కు అనుసంధానం
- నేరుగా వినియోగదారులకు బిల్లు



ఆటోమేటిక్ మీటర్

ఖమ్మంవ్యవసాయం: హెచ్‌టీ(హైటెన్షన్) విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియ చేపట్టగా మీటర్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్లు మాన్యువల్ బిల్లింగ్ విధానం అమల్లో ఉండగా, ఇప్పుడు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్(ఏఎంఆర్) వ్యవస్థను విద్యుత్ సంస్థ అమలుచేస్తోంది. బిల్లింగ్ విధానంలో తప్పులు దొర్లకుండా, పారదర్శకతను పెంచడంతో పాటు వేగవంతమైన బిల్లింగ్ కోసం ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా కేటగిరీ-2, 3(హెచ్‌టీ) సర్వీసులకు మాత్రం మీటర్లను ఏర్పాటుచేస్తున్నారు.

రీడింగ్ తీసే పని లేకుండా...

మీటర్ల వారీగా రీడింగ్ బాధ్యతలను విద్యుత్ సంస్థలో వివిధ స్థాయి అధికారులు నిర్వర్తిస్తున్నారు. హైఓల్టేజీ(హెచ్‌టీ) విద్యుత్ కేటగిరీలో 55 హెచ్‌పీకి మించి సామర్థ్యం ఉంటే ఏడీఈ స్థాయి, ఆ లోపైతే ఏఈ స్థాయి అధికారి రీడింగ్ తీయాల్సి ఉంటుంది. ఇక మిగతా సర్వీసుల రీడింగ్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్లు, ప్రైవేట్, జూనియర్ లైన్‌మెన్లు సేకరిస్తున్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల వ్యవస్థలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ విధానం అమల్లోకి వస్తుండగా ప్రత్యేకంగా రీడింగ్ నమోదు చేయాల్సిన అవసుముండదు. అయితే, ఈ ఈ విధానం అన్ని కేటగిరీలకు అమలుచేస్తే రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం

విద్యుత్ వినియోగాన్ని స్మార్ట్ మీటర్ నమోదు చేయనుండగా.. దీనిని ఆటోమేటిక్ మీటర్ రీడింగ్(ఏఎంఆర్) విధానంగా వ్యవహరిస్తారు. ఈ విధానంలో భాగంగా మీటర్‌లోనే 4జీ కమ్యూనికేషన్ సిమ్ ఏర్పాటుచేసి సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానిస్తారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలకు సంబంధించి సెంట్రల్ సర్వర్‌ను హనుమకొండలోని కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మానవ ప్రమేయం లేకుండానే ఆ సర్వీసులో వాడుకున్న విద్యుత్ ఆధారంగా ప్రతీ 30 రోజుల్లో బిల్లింగ్ అవుతుంది. బిల్లు వివరాలు పరిశ్రమల యాజమానుల మెయిల్ లేదా ఫోన్‌కు చేరుతుంది. తద్వారా వారు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు, రైస్ మిల్లులు, వివిధ రకాల పరిశ్రమలకు సంబంధించి 875 హైవోల్టేజీ సర్వీసులు ఉండగా.. అన్నింటికీ స్మార్ట్ మీటర్లు బిగించే పనులు జరుగుతున్నాయి.

అందరికీ ప్రయోజనకరం



పరిశ్రమల్లో ఏర్పాటుచేస్తున్న ఆటోమేటిక్ మీటర్లతో ప్రయోజకరంగా ఉంటుంది. వీటి ద్వారా లోపాలు లేకుండా వినియోగదారులకు కచ్చితమైన బిల్లింగ్ అమలవుతుంది. సరఫరాలో వచ్చే హెచ్చుతగ్గులను సైతం గుర్తించే అవకాశముంది. సిబ్బంది సమయం కూడా వృథా కాదు.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఖమ్మం

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

జాబితాలో శ్రామిక్‌లు, కండక్టర్లు, డ్రైవర్లు, ఏడీసీలు

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని వివిధ డిపోల ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. శ్రామిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు, ఏడీసీలకు పదోన్నతులు కల్పించి నూతన స్థానాలకు బదిలీ చేస్తూ ఆర్ఎం సరిరామ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఆర్ఎంగా సరిరామ్ బాధ్యతలు చేపట్టాక ఉద్యోగులకు పదోన్నతులు లభించడం ఇది రెండోసారి కాగా, కోరుకున్న స్థానాలకు బదిలీ చేయడంపై వారు వ్యక్తం చేశారు. కండక్టర్లు, డ్రైవర్లకు అసిస్టెంట్ డిపో క్లర్కులుగానే కాక ఏడీసీలు, టీఐ-3 ఉద్యోగులు పలువురికి పదోన్నతి లభించింది.

పదోన్నతులు ఇలా...

శ్రామిక్‌లుగా విధులు నిర్వర్తిస్తున్న 14మందికి హెల్పర్లుగా పదోన్నతి కల్పించారు. సత్తుపల్లి, ఖమ్మం డిపోల నుంచి నలుగురు చొప్పున, భద్రాచలంలో ఇద్దరితో పాటు ఖమ్మం, మధిర, మణుగూరు, ఇల్లెందు నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. అలాగే, 14 మంది మెకానిక్స్, ఆర్టిజన్లకు గ్రేడ్-1 మెకానిక్‌లుగా పదోన్నతి లభించింది. ఇక కండక్టర్, డ్రైవర్లు 14 మందికి ఏడీసీలుగా పదోన్నతి కల్పించారు. ఇందులో ఖమ్మం డిపో నుంచి ఏడుగురు, భద్రాచలంలో ముగ్గురు, కొత్తగూడెంలో ఇద్దరు, సత్తుపల్లి, మణుగూరు నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. అలాగే, ఐదుగురు ఏడీసీలకు డిపో క్లర్క్(డీసీ)లుగా పదోన్నతి లభించింది. మధిరలో ఇద్దరు, ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలంలో ఒక్కొక్కరు ఉన్నారు.

మల్లన్న ఆలయ ఆస్తులకు రక్షణ

విలువైన భూముల చుట్టూ ఫెన్సింగ్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని గుంటు మల్లన్న ఆలయ భూముల రక్షణకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎట్టకేలకు రంగంలోకి దిగింది. ఖమ్మం ట్రంక్ రోడ్డులో 400ఏళ్ల చరిత్ర కలిగిన గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం ఉండగా, ఈ ఆలయానికి కాల్వొడ్డులో 3.07 ఎకరాలు, సుందరయ్యనగర్‌లో 4.19 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.కోట్లలోకి చేరడంతో కొందరు ఆక్రమించుకున్నారు. దీంతో అధికారులు కోర్టును ఆశ్రయిస్తే, ఆక్రమణదారులు కూడా భూమి తమదేనని తప్పుడు పత్రాలు సృష్టించారు. ఈ విషయమై జూలై 21న 'మల్లన్న ఆస్తులకు రక్షణేది?' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమవగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈమేరకు శుక్రవారం దేవస్థానం మేనేజర్ చందూరు రామకోటేశ్వరరావు, సిబ్బంది పర్యవేక్షణలో కాల్వొడ్డులోని బొక్కలగడ్డ వైపు ఉన్న సుమారు 1.20 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. మరో వైపు ఉన్న భూమికి కూడా ఫెన్సింగ్ వేయించనున్నామని మేనేజర్ తెలిపారు.



పనులను పర్యవేక్షిస్తున్న ఉద్యోగులు

క్లుప్తంగా

శిక్షల శాతం పెరిగేలా మెరుగైన దర్యాప్తు

- పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: నిందితులకు శిక్ష పడేలా కేసుల దర్యాప్తులో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ముదిగొండ, బోనకల్, చింతకాని పోలీస్‌స్టేషన్ల అధికారులతో సీపీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు అందేలా ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయాలని విచారణ చేపట్టాలని, ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఇదే సమయాన కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికలు ఎప్పుడు జరిగినా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కాగా, రైతులకు యూరియా పంపిణీ సమయాన సమస్యలు తలెత్తకుండా చూడాలని సీపీ సూచించారు. ఈసమావేశంలో సీఐలు స్వామి, మురళి, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జాతీయ శిబిరంలో కేఎండీసీ కేడెట్



కేడెట్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకుడు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన జి.విశాల్ జాతీయస్థాయి ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. తెలంగాణ నుంచి పదిమంది కేడెట్లు ఢిల్లీ లో జరిగిన ఆల్ ఇండియా తలసైనిక్ ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో పాల్గొనగా, ఈ బృందంలో విశాల్ ఉన్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణారావు, ఎన్‌సీసీ అధికారి లోయ రాజశేఖర్ అభినందించారు.

హైఓల్టేజీతో దగ్ధమైన గృహోపకరణాలు

తల్లాడ: ఒక్కసారిగా హైఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో శుక్రవారం తల్లాడ మండలం మల్లారంలోని పలువురి ఇళ్లలో మోటార్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సుమారు వంద ఇళ్లలోని సీలింగ్ ఫ్యాన్లు, టేబుల్ ఫ్యాన్లు, మిక్సీలు, మోటార్లు, టీవీలు తదితర ఉపకరణాలు కాలిపోగా, తీవ్ర నష్టం ఎదురైందని స్థానికులు వాపోయారు. ఈ విషయమై ఏఈ రాయల ప్రసాద్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైరు తెగిపోవడంతో హై హోల్టేజీ విద్యుత్ సరఫరా అయిందని తెలిపారు.

22న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ -19 ఫుట్‌బాల్ బాలుర జట్టును ఈనెల 22న ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో పాటు ఇంటర్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు రాష్ట్రస్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల పోటీల్లో పాల్గొంటుందని, వివరాలకు 99896 47696, 98483 41238 నంబర్లలో సూచించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గానికి సన్మానం



దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్‌రెడ్డి, సుంకర భిక్షంగౌడ్‌ను ఖమ్మంలో జిల్లా నాయకులు శుక్రవారం సన్మానించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి జిల్లాకు రావడంతో సన్మానించగా, వారు మాట్లాడారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు, మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు, నాయకులు చిత్తులూరి ప్రసాద్, లింగం సతీష్, గుడిపూడి శ్రీనివాసరావు, సాగర్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,702	3,000
కందులు	5,500	3,900
ఏసీ మిర్చి	14,650	8,000
మిర్చి	8,100	7,000
కొత్త పత్తి	6,511	5,000
పాత పత్తి	7,500	6,600

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరం

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: రోజురోజుకు కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యాన అందుకు అనుగుణంగా పోరాట కార్యాచరణ రూపొందించాల్సి ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విస్తరణ, సైద్ధాంతిక అవగాహన, ప్రజా పోరాటాల రూపకల్పనే అజెండాగా సీపీఐ 25వ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈనెల 21నుంచి మొహలీలో జరిగే సభల్లో పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించడంతో పాటు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కాగా, జిల్లా నుంచి ఎనిమిది మందితో కూడిన ప్రతినిధి వర్గం ఈ సభల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు మహ్మద్ మౌలానా, యర్రా బాబు, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో తనిఖీ

ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసిన అదనపు కలెక్టర్



అధికారులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈనెల 26లోగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో తనిఖీకి వివిధ శాఖల అధికారులతో నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవన ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ట్రేడ్ లైసెన్స్, ఇతర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్ రెడ్డి, సీడీపీఓ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్

ఖమ్మం సహకారనగర్/ఎర్రుపాలెం/ఏన్కూరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలనే డిమాండ్‌తో టీఎస్ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే, కార్యక్రమానికి జిల్లా నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. కాగా, ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరితే ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం గర్హనీయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. దివ్యాంగురాలని కూడా చూడకుండా ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో మండల ఉపాధ్యక్షులు శ్రీదేవిని నిర్బంధించారని తెలిపారు. అక్రమ అరెస్టులతో తగ్గకపోగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని వెల్లడించారు. కాగా, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, నాయకుడు నంద్రు వెంకటేశ్వరరావును ఎర్రుపాలెంలో, ఏన్కూరులో శ్రీదేవి, బి.రాంచంద్, మూడ్ పుల్లయ్య, జె.పుల్లయ్య తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.



ఏన్కూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న యూటీఎఫ్ నాయకులు

బాలలకు ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్

ఖమ్మం మామిళ్లగూడెం: చిన్నారులు మొదలు కౌమార దశలోని బాలల వరకు ఫోన్ వినియోగించే క్రమాన తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, తద్వారా ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ లభిస్తుందని న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్కోప్ ఆర్‌డీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఖమ్మం టీటీడీసీలో శుక్రవారం పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఇంటర్నెట్‌తో కూడిన ఫోన్లు అందుబాటులోకి వచ్చినందున పిల్లలు వినియోగించేటప్పుడు వేధింపులకు గురికాకుండా చూడాలని తెలిపారు. అంతేకాక మానసిక, శారీరక రుగ్మతలకు గురయ్యే ప్రమాదం నుంచి రక్షించాలని సూచించారు. జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవసరమైన బాలలకు ఉచిత న్యాయసాయం అందుతుందని, సమస్యలు ఉంటే 1098 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ శిక్షణలో సైబర్ క్రైం విభాగం డీఎస్పీ ఫణీందర్, ఎస్సై విజయ్‌కుమార్, వివిధ సంస్థల బాధ్యులు కె.సుజాత, వెంకీ నాయుడు, బాలినేని, లక్ష్మయ్య, కిరణ్‌కుమార్, శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వంద శాతం హాజరుకావాలి

పాఠశాలల తనిఖీలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా

నేలకొండపల్లి/కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా ఆదేశించారు. నేలకొండపల్లి మండలంలోని నేలకొండపల్లి, రాజేశ్వరపురం, కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. నేలకొండపల్లి పాఠశాలలో 530 మంది విద్యార్థులకు 404 మంది, రాజేశ్వరపురంలో 586 మందికి 462 మందే హాజరుకావడంతో ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆతర్వాత తరగతి గదుల్లో విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆమె, అంగన్‌వాడీ కేంద్రం, భవిత కేంద్రాల్లో కూడా తనిఖీ చేశారు. ఎంపీడీఓలు ఎం.ఎర్రయ్య, రామచంద్రరావు, ఎంఈఓలు బి.చలపతిరావు, బీ.వీ.రామాచారి తదితరులు పాల్గొన్నారు.



రాజేశ్వరపురంలో వంటలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

చింతకాని: రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, ఐకేపీ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని నివారించాలని ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు సూచించారు. చింతకాని మండలం చిన్నమండవ ఇసుక రీచ్‌ను శుక్రవారం పరిశీలించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. రాత్రి వేళ ఎట్టి పరిస్థితుల్లోనూ కూడా ఇసుక అక్రమ రవాణా జరగదొద్దని తెలిపారు. ఇందుకోసం కూపన్లపై సమయం, తేదీ ముద్రించాలని చెప్పారు. చిన్నమండవ మున్నేరు ఇసుక రీచ్ వద్ద ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన రహదారిని తొలగించాలని ఆదేశించారు. వైరా సీఐ సాగర్, చింతకాని, ముదిగొండ తహసీల్దార్లు బాబ్జీప్రసాద్, సునీత ఎలిజబెత్, ఉద్యోగులు జగదీష్, ప్రసన్నకుమార్, నాగపుల్లారావు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



భద్రుసింగ్ (ఫైల్)

కారేపల్లి: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని పేరుపల్లికి చెందిన బానోతు భద్రుసింగ్ (50) ఆరు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూనే అద్దెకు ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఆయన తొలుత ఓ మహిళతో వివాహం జరగగా వీరికి జన్మించిన ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేసి వివాహాలు జరిపించారు. మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందాక మరో మహిళను భద్రు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈక్రమాన ఏం జరిగిందో ఏమో కానీ మద్యం మత్తులో నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగగా ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో బోనకల్ మండలం ముష్టికుంటకు చెందిన చిట్టంశెట్టి వెంకటనారాయణకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని తీర్పు చెప్పారు. రఘునాథపాలెం మండలం శివాయిగూడెం గ్రామానికి చెందిన పొన్నం శేషగిరిరావు వద్ద వెంకటనారాయణ 2021 జూన్‌లో రూ.18 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ నగదు చెల్లించే క్రమాన అదే ఏడాది ఏప్రిల్‌లో రూ.10 లక్షలకు చెక్కు జారీ చేశాడు. కానీ అయన ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో శేషగిరిరావు న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో జైలుశిక్షతో పాటు రూ.10లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు. అంతేకాక వెంకటనారాయణకు మరో కేసులోనూ ఆరు నెలలు జైలు శిక్ష, ఫిర్యాదికి రూ.10 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువడింది.

సాక్షి ఫ్యామిలీ
IV
ఖమ్మం
శనివారం ॥ 20-9-2025



'రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి' అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.

తొలి అడుగు

ఫస్ట్ క్లాస్ జర్నీ

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...

'నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు' అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.

నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.

ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదుగురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీఈడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీఈడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నెలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్టర్న్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

■ దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు-ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపకపోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ 'శభాష్' అనిపించుకుంది సురేఖ.

'దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది' అంటుంది సురేఖ.

■ గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది. 2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.

■ ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

'ఆడవాళ్ల ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.





కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

'ట్రెయిన్ నడపడం అంటే మాటలా!'లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్



ఘనమైన వీడ్కోలు

సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.

'సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి' అన్నారు వక్తలు.

వంటిల్లు

దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..



అమ్మకు నైవేద్యం

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిసి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్ల కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్ల వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్ల తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – బేటుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ, మీ థాట్ హోమ్ డిలైట్

రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!



వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని 'బాక్సర్‌ల కుటుంబం' అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన ఋఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. 'అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది' అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందర పడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన 'వరల్డ్ బాక్సింగ్ కప్'కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా 'ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా' అంటూ 'ఎక్స్' వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో 'తూమక్ తూమక్' అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన 'తూమక్ డ్యాన్స్' ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్‌ఫెక్ట్‌గా అనుసరించి 'వారేవా' అనిపించారు.

'మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వంద సార్లు చూసి ఉంటాను' అన్నాడు ఒక యూజర్.

'నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?' అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాషిన్ 'జుట్టి మేరీ' ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు



ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్లుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

'తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను' అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకువచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –''గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా 'ఆన్-సైట్' వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో-డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయంలో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో-టాయిలెట్లు, పబ్లిక్- కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో-టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం'' అని చెప్పారు నమిత.

దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్య. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను 'నత్రినై' అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 19న ముగింపు ధరలలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	బంగారం (24 క్యారెట్లు)	1,13,500	బంగారం (24 క్యారెట్లు)	1,11,330	బంగారం (24 క్యారెట్లు)	1,13,500	బంగారం (24 క్యారెట్లు)	1,14,050	బంగారం (24 క్యారెట్లు)	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	బంగారం (22 క్యారెట్లు)	1,02,050	బంగారం (22 క్యారెట్లు)	1,02,050	బంగారం (22 క్యారెట్లు)	1,05,110	బంగారం (22 క్యారెట్లు)	1,04,930	బంగారం (22 క్యారెట్లు)	1,02,300
వెండి	1,33,500	వెండి	1,33,800	వెండి	1,43,000	వెండి	1,33,800	వెండి	1,33,300	వెండి	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.